ప్రజాశక్తి

మంగళవారం 3 జనవరి 2023 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా

'పది'లో మెరిసేలా...

- 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక
- కృష్ణాలో 22,268 మంది విద్యార్థులు
- సి, డి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- పరీక్షా కేంద్రాల గుర్తింపునకు కసరత్తు



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడానికి జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఏప్రిల్ నాలుగో తేదీ నుంచి పరీక్షల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. రెండేళ్లు కరోనా నేపథ్యంలో విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాలు నిరాశజనకంగా ఉన్నాయి. దీంతో ఈ ఏడాది పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేయాలని నిర్ణయించింది.

గత ఏడాది పదవ తరగతి ఫలితాల్లో ఉమ్మడి కష్ణాజిల్లా పదోస్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇతర జిల్లాల కంటే ఇక్కడే ఉత్తీర్ణత శాతం అధికంగా నమోదు కావాలి. కానీ పదవ తరగతి ఫలితాల్లో మారుమూల జిల్లాలతో పోలిస్తే వెనుకబడటం ఆందోళన కలిగించింది. 2019 వరకు జిల్లా ఉత్తీర్ణత శాతం 90 శాతం పైగా ఉండేది.. గత ఏడాది అందుకు భిన్నంగా 65.21 శాతం ఉత్తీర్ణతతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక రూపొందించింది. విభజన అనంతర జిల్లాలో 22,268 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా పరిషత్ నుంచి పది విద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన స్ఫూర్తి మెటీరియల్‌ను అందించారు. ఇప్పటి వరకు జరిగిన సమ్మెటివ్ ఎగ్జామ్స్, ఇతర టెస్టుల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏ, బి , సి, డి గ్రేడ్లుగా విద్యార్థులను విభజించారు. సి,డి గ్రేడ్ లు వచ్చిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారి చదువు పట్ల శ్రద్ధ తీసుకుంటున్నారు. పాఠశాల తరగతులు ముగిసిన తర్వాత ప్రతిరోజు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల మధ్య గంటసేపు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఆయా పాఠ్యాంశాలలో వెనుకబాటు ఉన్న సబ్జెక్టులను మళ్లీ బోధిస్తున్నారు. విద్యార్థులకు సాయంత్రం పౌష్టికాహారం కింద స్నాక్స్ అందజేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమ్మిట్ పరీక్షల అనంతరం పదవ తరగతి విద్యార్థులకు టెస్ట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి సబ్జెక్టు నాలుగు భాగాలుగా విజించి ఒకొక్క భాగానికి సంబంధించిన సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. దీనివల్ల రెండు రోజులకోసారి ఏదో ఒక సబ్జెక్టు పరీక్షను (మిగతా 6లో)

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ఉపాధ్యాయులు దత్తత తీసుకుంటున్నారు. పదవ తరగతి పరీక్షా పత్రాల మోడల్ పేపర్లను అన్ని పాఠశాలలకు పంపించాం. జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక సహకారంతో స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు డిసెంబర్ నెలలో అందజేశాం. పాఠశాలలకు గైరాజరవుతున్న విద్యార్థులపై ప్రత్యేక దష్టి పెట్టాం. విద్యాశాఖ అధికారులు తరచూ పాఠశాలలను తనిఖీ చేస్తూ.. లోటుపాట్లు ఉంటే తగిన చర్యలు తీసుకుంటున్నారు.

23న చేగువేరా వారసులు విజయవాడ రాక

నేడు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన సన్నాహక సమావేశం

ప్రజాశక్తి-విజయవాడ: లాటిన్ అమెరికా విప్లవయోధుడు చేగువేరా వారసులు విజయవాడ వస్తున్న సందర్భంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో 3వ తేదీ మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వామపక్ష శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరవ్వాలని కోరారు. విప్లవ యోధుడు చేగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా (ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు), మనుమరాలు ఎస్టేఫన్ గువేరా (అర్ధశాస్త్ర ఆచార్యులు) క్యూబా జాతీయ సంఘీభావ కమిటీ ఆహ్వానం మేరకు ఈ నెల 4 నుంచి 26 వరకు భారతదేశంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న వారు విజయవాడ వస్తున్న సందర్భంగా నిర్వహించే క్యూబా సంఘీభావ సభను జయప్రదం చేసేలా ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయడానికి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

యాప్ ద్వారా ఉద్యోగుల హాజరు తప్పనిసరి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు



ప్రజాశక్తి-విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు జనవరి 2వ తేది నుండి ఏపిఎఫ్ ఆర్ఎస్ యాప్ ద్వారా హాజరు తప్పని సరి అని సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో మొబైల్‌ఫోన్‌లో ఏపిఎఫ్ ఆర్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరానికి ఉదయం పది గంటలకే జిల్లా అధికారులు హాజరయ్యారు. 10.02 గంటలకు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు స్పందన కార్యక్రమంలో పాల్గొని 10.09 గంటలకు ఏపిఎఫ్ ఆర్ఎస్ యాప్ ద్వారా ఆయన ముఖ ఆధారిత హాజరును నమోదు చేసుకున్నారు. అనంతరం జిల్లా అధికారులు, ఉద్యోగులకు యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధానంపై వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు (మిగతా 6లో)



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

వారంలో పోర్టు భూసేకరణ పూర్తి

కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి తొలి దశ భూసేకరణ ప్రక్రియ మరో వారం రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని పలు శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ఏపీ మార్రిటైం బోర్డు ఆదేశించిన మేరకు మూడు దశల్లో పోర్టుకు కావాల్సిన 3,400 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. తొలి దశలో 1730. 32 ఎకరాలకు సంబంధించిన సరిహద్దులు నిర్ధారించాలని, ఇప్పటికే కోర్టుకు అడ్వాన్స్ పొజిషన్ సమర్పించినట్లు ఆయన తెలిపారు. పోర్టు ల్యాండ్ పరిధిలో ఉన్న భూముల్లో ప్రస్తుతం వేరుశనగ పంట ఉందని కాయతీత తర్వాత, ఆ వ్యవసాయ క్షేత్రంలో ఆ తదుపరి పంటలను సాగు చేయకుండా కట్టడి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేటు భూముల యజమానులకు నష్టపరిహారం ఎంత చెల్లించాలనేది అంచనా వేసి పంపించాలన్నారు. వారికి ఏమైనా నోటీసులు ఇవ్వాలంటే త్వరితగతిన తాహిసిల్దార్ ఇచ్చి తిరిగి వెనక్కి తీసుకోవాల్సిన భూములను సేకరించాలన్నారు. ఆర్డర్ తర్వాత వారికి డబ్బులు వెనక్కి ఇచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. రహదారుల అనుసంధానికి ప్రివ్యూ నోటిఫికేషన్ సంబంధించి ముడా కొనుగోలు చేసిన భూములలోనే (మిగతా 6లో)

రోడ్డెక్కిన రైతన్న

- రంగు మారిన ధాన్యం కొనుగోలుకు నిబంధనలు సడలించాలని డిమాండ్
- పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిపై రాస్తారోకో



కొత్త పెదమద్దాలి వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కోసం రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. సహనం నశించిన రైతులు రోడ్డెక్కారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పామర్రు-కత్తిపూడి జాతీయరహదారిపై పామర్రు మండలం కొత్త పెదమద్దాలి వద్ద రైతులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. అరగంటకుపైగా రాస్తారోకో సాగడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. రాస్తారోకో ఉపసంహరించాలని సిఐ వెంకటనారాయణ, తహశీల్దార్లు భరత్‌రెడ్డి, విమలకుమారి కోరినా రైతులు ససేమిరా అన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీధర్ హుటాహుటిన రాస్తారోకో జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. ఆర్బీకెల్లో నిర్ణయించిన తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోకుండా మద్దతు ధరలో మిల్లర్లు కోత పెడుతున్నారని తెలిపారు. సంచులు సకాలంలో అందడం లేదని, కాటా వేసిన ధాన్యం తరలించడానికి రవాణా వాహనాలు రావడం లేదని తమ సమస్యలను శ్రీధర్‌కు వివరించారు. నిబంధనలు సడలించి రంగుమారిన ధాన్యం సేకరించాలన్నారు. రైతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని శ్రీధర్ హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. పామర్రు మండలంలోని బలిపర్రు, పెదమద్దాలి. కొత్త పెదమద్దాలి, అడ్డాడ గ్రామాలకు చెందిన రైతులతోపాటుగా రైతు నాయకులు అడుసుమిల్లి శ్రీనివాసరావు, జమి గొల్లేపల్లి ఎంపిటీసీ యేర్నేని అరవింద్, బలిపర్రు సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్, కౌలు రైతులు పత్తిపాటి కొండ, పసుపులేటి శ్రీనివాసరావు, ఇజ్రాయిల్, కె.దక్షిణామూర్తి, కె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

45వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక 45వ డివిజన్ పరిధిలో ఉన్న రాము క్వారీలో రోడ్డు నిర్మాణానికి సోమవారం 45వ డివిజన్ వైసీపీ నాయకులు మైలవరపు కృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మైలవరపు కృష్ణ మాట్లాడుతు రోడ్డు సరిగ లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య ఈ విషయాన్ని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు దష్టికి తీసుకు వెళ్లగా ఆయన వెంటనే స్పందించి రోడ్డు పనులు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. ఈ రోడ్డు పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది బుచ్చిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, పీతల నాగు, కానురి శివ, నల్లం వాసు, గుండు లక్ష్మి, ఉండబట్ల వెంకట్రావు, సరగడ కృష్ణ పాల్గొన్నారు.

కొడాలి నాని నోరు అదుపులో పెట్టుకోవాలి : బుద్దా

ప్రజాశక్తి-వన్‌టౌన్: చంద్రబాబుపై కొడాలి నాని ఇష్టమొచ్చినట్లు ఒక పిచ్చి కుక్కలా మొరుగుతున్నాడని, నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న తెలిపారు. వన్‌టౌన్‌లోని బుద్ధా వెంకన్న కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో బుద్ధా వెంకన్న మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనలో పలువురు చనిపోవడంతో చంద్రబాబుతో పాటు తామంతా కుమిలిపోయామని తెలిపారు. వైసిపి మంత్రులు చెంచాగాళ్లు చంద్రబాబుపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గుంటూరులో ఎవరో ప్రోగ్రామ్ పెడితే చంద్రబాబు వెళ్లారని, ఆయన వెళ్ళిపోయిన తరువాత జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు చనిపోయారని చెప్పారు. 2019 లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాకే ఎపికి శని పట్టిందన్నారు. జగన్, తాజా మాజీ మంత్రులే లబ్ధిపొందారని తెలిపారు. గోదావరిలో బోటు మునిగితే 38 గంటలైనా నాలుగు మృతదేహాలను ఇప్పటికీ వెలికి తీయలేదన్నారు. చంద్రబాబు చారిత్రాత్మకమైన తప్పు చేసింది కృష్ణా జిల్లాలో కొడాలి నానికి టిక్కెట్ ఇవ్వడమే అన్నారు. చంద్రబాబు రథ యాత్రను తప్పు పట్టే స్థాయి కొడాలి నానికి లేదన్నారు. రాష్ట్రాన్ని బాగు చేయాలంటే చంద్రబాబు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, అది తెలుసుకోవాలని హితవు పలికారు. రాష్ట్రానికి శని ఎవరో డిబేట్‌కు నేను రెడీ., కొడాలి నాని రా ప్రజల్లో తేల్చుకుందామని బుద్ధా వెంకన్న సవాల్ విసిరారు. గుడివాడలో ఓడిపోతామనే కొడాలి నాని ఫ్రెస్టేషన్‌లో మాట్లాడుతున్నారని విమర్శించారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: నిరాశ్రయులై నగరంలో ఫుట్ పాత్ మీద పడుకుని చలికి వణుకుతూ ఉన్న వారికి మా "ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ" స్వచ్ఛంద సేవా సంస్థ నగర కమిటీ ఆధ్వర్యంలో విస్సన్నపేట కు చెందిన రిటైర్డ్ టీచర్ పి. శేషయ్య - నాగరత్నం దంపతుల సహాయంతో దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చాట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ చలికాలంలో ఎంతో మంది నిరుపేదలైన నిరాశ్రయులు విజయవాడ నగరంలో ఫుట్ పాత్ మీద పడుకుని చలికి వణుకుతూ ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వారికి దయాగుణం కలిగిన వారందరూ ఒక్కొక్కరు ఒక్కో దుప్పటి సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ విజయవాడ నగర కమిటీ కన్వీనర్ మట్టా ఏసుపాదం, సభ్యులు మధుకుమార్, మేరీ, హన్నమణి తదితరులు పాల్గొన్నారు.



దళితుల అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలి

కలెక్టర్‌కు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం వినతి



ప్రజాశక్తి-విజయవాడ: మండల కేంద్రమైన మైలవరం రెవిన్యూ పరిధిలోని అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు రక్షణగా నిలిచి, వారి భూములను రీ సర్వే చేయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పేద దళితులు జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావును కోరారు. ఈ మేరకు పేద దళితులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశం మందిరంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డిల్లీరావుకు వినతిపత్రం అందజేశారు. అలాగే సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటా కళ్యాణ్ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి దళితులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను వారికి దక్కేటట్లు అధికారులు చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. మండల కేంద్రమైన మైలవరం రెవెన్యూ పరిధిలోని ఆర్ఎస్ నెంబర్ 311 నుంచి 315 వరకు 52 మంది పేద దళితులకు 72 ఎకరాలు ఎసైన్డ్ చేసి, పట్టాలు ఇచ్చిందని అన్నారు. అయితే ఈ భూములను కొందరు భూస్వాములు వారికుండే రాజకీయ, ఆర్థిక పలుకుబడితో పేద దళితులను బెదిరించి, అక్రమంగా లాగేసుకునే ప్రయత్నం చేశారన్నారు. ఈ భూమి సర్వే నెంబర్లు మార్చివేసి, భూములు దళితులవి కావన్నట్లుగా కోర్టు కేసులు బనాయించారన్నారు. 1974 నుంచి పేదలకు ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. ఇప్పటి నుంచి చెట్టు పుట్ట కొట్టి సదును చేసి, పెసర, మినుము, కంది , వేరు శనగ, అపరాలు వంటి పంటలు పండిస్తున్న పేదల భూములపై భూస్వాముల కన్ను పడిందన్నారు. దీంతో ఈ భూముల సర్వే నెంబర్లు మార్చారన్నారు. ఈ భూములు దళితులవి కావని, బెదిరించడమే గాక, రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, పేదలను భూముల్లోకి రాకుండా దాడులు చేస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పలుసార్లు అధికారులను ఆశ్రయించినా భూస్వాములకు వత్తాసు పలుకుతున్నారే తప్పా, దళితులకు రక్షణగా ఉండటం లేదన్నారు. ఈ భూముల్లో మామిడి లాంటి పంటలు వేసి ప్రతి సంవత్సరం ఫలసాయాన్ని పేదలు పొందుతున్నా, భూస్వాముల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని అన్నారు. ఇప్పటికయినా ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకొని అసైన్డ్ భూముల సాగుదారులకు అధికారులు రక్షణగా నిలిచి, భూములను రీసర్వే చేయించి, పట్టాదారు పాస్‌పుస్తకాలు, హక్కు పత్రాలు ఇవ్వాలని ఆయన కోరార. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో భూమి సాగుదారులైన వంగూరు లాజర్, టి యేసు, ప్రత్తిపాటి ఏసు, బుద్ధి యోహాను, ఓలేటి ఏసు, సయ్యద్ జానీ, సయ్యద్ కరిముల్లా, సారున్నీషా బేగం, శేఖర్, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ దుర్గారావుకు అభినందన



ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఆర్ట్ ఫోటోగ్రఫీతో అద్భుతమైన చిత్రాలను దృశ్యీకరించిన ఉప్పాడ దుర్గారావును ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్.కె. రోజా అన్నారు. ఫోటోగ్రాఫర్ దుర్గారావును సోమవారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్‌ను మంత్రి అభినందించారు. ఆర్ట్ ఫోటోగ్రఫీపై ఆసక్తితో సహజ చైతన్యం కలిగించే విధంగా ఫోటోలను తీస్తూ పలు సంస్థల నుండి అవార్డులు దుర్గారావు అందుకున్నారన్నారు. దుర్గారావు తీసిన దృశ్యాలతో కూడినఅరకు అందాలు ఆర్ట్ ఫోటోగ్రఫీ ఆల్బమ్‌ను ఆమె ఆవిష్కరించారు. ప్రతి ఏడాది అందచేసే ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫోటోగ్రఫీ (ఈఎఫ్ఐపీ) అవార్డుకు 86 మంది పోటీ చేయగా అందులో జిల్లా నుండి దుర్గారావు ఎంపికయ్యాడని రోజా అభినందించారు. గిరిజన జీవనశైలిని ప్రతిబింబించే ఫోటోలతో కూడిన అల్బమ్ అద్భుతంగా ఉందని అన్నారు. దుర్గారావు వంటి ఔత్సాహిక కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మచ్చాశ్రీనివాసరెడ్డి, మూలంరెడ్డి సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, మాల్కాపురం కనకారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును అరెస్టు చేయాలి : ఉదయభాను



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ప్రచార పిచ్చితో సుమారు 11 మంది మృతికి పరోక్షంగా కారణమైన ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై హత్యనేరం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రోజురోజుకు ప్రజల్లో ఉనికిని కోల్పోతున్న చంద్రబాబు ప్రజలంతా తన వైపే ఉన్నారని చాటుకోవడానికి పలు కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. ఇరుకు సందుల్లో ఎక్కువ మందిని సమీకరించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించే సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించడంతో ఓర్వలేక చంద్రబాబు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. తన రాజకీయ ప్రచార ఆర్భాటం కోసం కొత్త సంవత్సరం రోజున నిరుపేద మహిళల జీవితాలలో విషాదం నింపిన చంద్రబాబు ని ఈ పాపం వదిలిపెట్టదని తప్పకుండా తగిన మూల్యం చెల్లించుకుంటారని తెలిపారు. పదేపదే ఇలాంటి సంఘటనలు పునరావతం అవుతున్నప్పటికీ చంద్రబాబు వైఖరిలో ఏమాత్రం పశ్చాతాపం గాని తన వైఖరిలో మార్పు రావడం గానీ జరగడం లేదని, ఇలాంటి రాక్షస క్రీడలకు పాల్పడుతున్న చంద్రబాబుకు తగిన సమయంలో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.



రేషన్ పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మొహమ్మద్‌పేట గ్రామంలో సోమవారం రేషన్ పంపిణీని రాష్ట్ర ఎఫ్ఎఫ్‌సిఐ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ జోషి పరిశీలించారు. ప్రజలకు ఈ నెల నుండి ఉచితంగా బియ్యం పంపిణి జరుగుచున్నదా లేదా అని పరిశిలించినారు. రేషన్ తీసుకుంటున్న ప్రజలను కూడా మీకు ఉచితముగా రేషన్ అందుతుందా ప్రశ్నించగా అక్కడ ఉన్న ప్రజలు కూడా ఈ నెల నుండి ఉచితంగానే రేషన్ బియ్యం ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమములో డీఎస్‌ఓ కోమలి పద్మ, జగ్గయ్యపేట మండల తాసిల్దార్ డిటి నాగరాజు, విఆర్‌ఓ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి కన్నెకంటి, నర్వనేని రాజీనామా

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెకంటి జీవరత్నం, నర్వనేని మురళీ సోమవారం వైసిపికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ తమకు తగిన ప్రాధ్యానత ఇవ్వకపోవడంతోనే పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. తాము ఏ పార్టీలో చేరేది త్వరలో తెలియజేస్తామన్నారు.



యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: యుటిఎఫ్ కేలండర్‌ను తాసిల్దార్ ఎం.పాల్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి భవాని, ప్రధాన కార్యదర్శి ఎం బాల కోటేశ్వరరావు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు డి శేషగిరి, కోశాధికారి మల్లాది తిరుపతిరావు, కార్యదర్శులు పి సుబ్రహ్మణ్యం, ఎం రాజేశ్వరమ్మ, డి మల్లేశ్వరరావు, కె విజయ్ కుమార్, ఎన్ సత్యనారాయణ, ఎం వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ విడుదల

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జగ్గయ్యపేట లైమ్ స్టోన్ మైన్స్ నందు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర కేలండర్‌ను యూనిట్ ఇంచార్జీ బియువిఎన్ రాజు ఆవిష్కరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.రామచంద్రనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డి విజయకుమార్, పి సర్వేశ్వరరావు, ఎస్ బలరాం, ఎల్ దేవోజీ, నవీన్, కె భాస్కర్, సురేశ్ కుమార్, సురేంద్ర నాయక్, రవితేజ, అమృతరావు, జూలియస్ పాల్గొన్నారు.



జాస్తి బసవరావు జీవితం యువతరానికి ఆదర్శం

ప్రజాశక్తి-గన్నవరం : పేద ప్రజల అభ్యున్నతి కోసం తన ప్రాణాలను అర్పించిన అమరజీవి జాస్తి బసవరావు జీవితం నేటి యువతరానికి ఆదర్శమని సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్ అన్నారు. సోమవారం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమరుల స్థూపం వద్ద అమరజీవి జాస్తి బసవరావు 73 వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం గన్నవరం ప్రాంతంలో పెద్ద ఎత్తున జరిగిన ప్రజా ఉద్యమాల్లో కీలక భూమిక పోషించిన వారిలో బసవరావు ఒకరన్నారు. ఈ దేశం అన్ని విధాలుగా అభివద్ధి చెందాలంటే కమ్యూని స్టులు అధికారంలో ఉండాలని ఆయన ఆకాంక్షించారని కానీ అది నెరవేరలేదన్నారు. అయితే దేశాన్ని గుత్త పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న బిజెపి పాలకులు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్నారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల తర్వాత కూడా బిజెపి అధికారంలో కొనసాగితే భారతదేశం పూర్తిగా ప్రమాదంలో పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక రాష్ట్రంలో పరిస్థితి గమనిస్తే అధికారంలో ఉన్న వైసిపి ప్రతిపక్షంలో ఉన్న టిడిపి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం తిట్టుకోవడం తప్ప, దేశానికి నష్టం కలిగించే బిజెపితో కలసి ప్రయాణం చేయాలని ఆలోచన చేస్తున్నారని చెప్పారు. ఇది రాష్ట్ర ప్రయోజనాలకు తీరని నష్టం కలిగిస్తుందని అన్నారు. ప్రజలంతా ఏకమై దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఈ పాలకులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు,



మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

ఐద్వా జిల్లా నాయకులు మల్లంపల్లి జయమ్మ, సిపిఎం సీనియర్ నాయకులు సుధా బత్తుల బుజ్జి, ఐద్వా నాయకులు యస్. కమల పాల్గొన్నారు. తొలుత జాస్తి బసవరావు స్థూపానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.

కాలువలో పడి బాలుడు మృతి



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : 18 నెలల బాలుడు ప్రమాదవశాస్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన గుడ్లవల్లేరు లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కవుతరం నుండి మామిడి కోళ్ళ రోడ్డులో పుల్లేరు కాలువ పక్కన నివాసం ఉంటున్న చప్పిడి రాఘువులు, సుకన్య రెండవ కుమారుడు యశ్వంత్‌కు తల్లి సోమవారం సాయంత్రం ఇంటి ముందు గల కాలువలో స్నానం చేయించింది. అనంతరం రోడ్డుమీద నిలబెట్టి బట్టలు తీసుకొచ్చేందుకు ఇంట్లోకి వెళ్ళి వచ్చేసరికి బాలుడు ప్రమాదవశాస్తూ కాల్వలో పడి కొట్టుకుపోయినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుడ్లవల్లేరు ఏఎస్ఐ సారధి బాబు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారు ముక్కోటి ఏకాదశి పండుగ పర్వదినం సందర్భంగా సోమవారం భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. అంతకుముందు ఆదివారం రాత్రి అమ్మవారి ఆలయం నందు పెద్ద ఎత్తున దీక్షా స్వాములచే భజన కార్యక్రమం, రాత్రి జాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దీక్ష గురు స్వామి వెంకటరమణ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన దీక్షా స్వాములచే నిర్వహించిన భజన కార్యక్రమంలో విశేషమైన పాటలతో భక్తులను అలరించాయి. స్వాములకు దేవస్థానం ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం ముక్కోటి ఏకాదశి సందర్భంగా దర్శనమిచ్చిన అమ్మవారిని దీక్షా స్వాములు, పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన రేగండ్ల వెంకటరమణ పదివేల రూపాయలు విలువ చేసే వరిగడ్డిని అమ్మవారి గోశాలకు విరాళంగా అందజేశారు. ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు, ఏఈఓ ఉమాపతి ఆధ్వర్యంలో భక్తులు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ఏకాదశి సందర్భంగా గ్రామంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో, శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో, శ్రీ స్వయం శంభు లింగేశ్వర స్వామి వారి ఆలయంలో, రామాలయాలలో స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట :** మండలం లోని తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భముగా దేవాలయం మొత్తం దాతల సహకారముతో పుష్పాలంకరణ చేసి ఉదయం ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా దేవాలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. శ్రీ స్వామి వారి దేవస్తానము నందు జరుగుచున్న నిత్యాన్నదాన పదకమునకు తాడేపల్లిగూడెం వాస్తవ్యులు కరణం శ్రీనివాసరావు, మీనా కుమారి లి రూ.10116 లు విరాళంగా అందించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పసుపులేటి రాధా సుబ్రహ్మణ్యేశ్వరరావు శ్రీ స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఎన్‌టిఆర్ స్టేడియం డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక నందమూరి తారకరామరావు స్టేడియం రూపొందించిన 2023 డైరీనీ మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సోమవారం ఎన్‌టిఆర్ స్టేడియంలోని కార్యాలయంలో అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు పాలేటి శివసుబ్రహ్మణ్యం(చంటి), సముంక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

దాతల సహకారంతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమర్తల సోమేశ్వర రావు సూచన మేరకు స్థానిక సబ్ కోర్టు కు వెళ్ళే రోడ్ కు పాగొలు సురేష్, నర్రా నారాయణలు వారి సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. సదరు రోడ్డు గుంతల మయంగా మారడంతో కక్షిదా రులు, న్యాయవాదులు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు మరమ్మతులు చేయడానికి అధికారులు ముందుకు రాకపోవడంతో దాతలను కోరడంతో వారు స్పందించి గ్రావెల్ రోడ్డు వేశారు.



రైతులకు ద్విచక్ర వాహనాల అందజేత



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

ప్రాథమిక సహకార వ్యవసాయ సొసైటీలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే పథకాలు ఎంతగానో మేలు చేస్తాయని వైయస్సార్ పార్టీ రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. మండలంలోని కవుతరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొంత నిధులతో 20 ద్విచక్ర వాహనాలకు రుణాల మంజూరు చేసి వాహనాలను అందజేయడం అభినందనీయమని అన్నారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా వాహన మిత్ర పథకం ద్వారా రుణాలు మంజూరు చేయటం అభినందనీ యమని విభాగ సహకార అధికారిని విజయలక్ష్మి అన్నారు. అనంతరం రైతులకు శశి భూషణ్, విజయలక్ష్మి చేతుల మీదుగా ద్విచక్ర వాహనాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ వడ్లమూడి నాగమోహన్, సెక్రెటరీ మీనాక్షి, బాడిగ భాస్కరరావు, వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు



అర్హులందరికీ పథకాలు అందించాలి

ప్రజాశక్తి కోడూరు : కోడూరు మండలంలోని కోడూరు-1, ఉల్లిపాలెం సచివాలయాలను బందరు డిఎల్ డిఓ జి.పద్మ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో ఉద్యోగుల పనితీరును పరిశీలించడంతో పాటు రికార్డులను తనిఖీ చేసి సంతప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా సచివాలయ ఉద్యోగులు పనిచేయాలని ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరు, మూమెంట్ రిజిస్టర్ను తనిఖీ చేసి పలు సూచనలిచ్చారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించి అక్కడ అధికారులకు సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కోడూరు సచివాలయంలో ఈవో ఎలవర్తి సుబ్రమణ్యం డిఎల్ డిఓ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ జ్ఞాపిక అందించి, సత్కరించారు.

కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు డిమాండ్ చేశారు. సోమవారం అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం ఈ డబ్ల్యూ ఎస్ కోటాలో ఐదు శాతం కాపులకు రిజర్వేషన్లు అమలుపరిస్తే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రిజర్వేషన్ల అంశం కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తుందని ఇప్పటివరకు అబద్ధపు ప్రచారాలు చేసిన వైసీపీ ప్రభుత్వం కాపులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి లోని కాపు నాయకులకు రోషం ఉంటే జగన్మోహన్ రెడ్డిని ఒప్పించి రిజర్వేషన్లు అమలు విషయంలో క్లారిటీ ఇప్పించాలని లేదంటే రాజీనామా చేసి బయటికి రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తోట ఆంజనేయులు తుంగల నరేష్ కమతం నరేష్ నాగభూషణం శ్రీ భాస్కర్ రోహిత్ బాలు దాసినేని శివ తదితరులు పాల్గొన్నారు

వెనిగండ్ల ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ

స్థానిక ఏలూరు రోడ్డు పద్మనాభం స్ట్రీట్‌లో వెనిగండ్ల ఫౌండేషన్ కార్యాలయాన్ని సోమవారం ఫౌండేషన్ అధినేత వేనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ సమస్యలతో వచ్చిన వారికి సహాయం అందించాలనే సంకల్పంతో ఫౌండేషన్ ప్రారంచామన్నారు. పుట్టిన ఊరు రుణం తీర్చుకోవాలనే ఉదేశంతోనే గుడివాడలో సేవా కార్యక్రమాలు కుల,మతాలకు అతీతంగా సేవలు అందిస్తామన్నారు. ప్రతేకంగ నిరుద్యోగ యువతకు బి.టెక్, యం.టెక్ చేసిన యువతకు ఉద్యోగాలు అందిస్తామన్నారు. గుడివాడను ఐటి హబ్‌గా మార్చేందుకు కషి చేస్తామన్నారు. త్వరలోనే సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామన్నారు.

నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

ప్రజాశక్తి-ఉంగుటూరు

ప్రభుత్వ నిబంధనలు సడలించి ప్రతి ధాన్యపు గింజను రైతుల నుండి కొనుగోలు చేయాలని సోమవారం రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉంగుటూరు తహసీల్దార్‌ను సోమవారం కలిసి కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత నెలలో కురిసిన అకాల వర్షం వల్ల వరి కుప్పలు వేసిన వాటిలో వర్షపు నీరు వెళ్లి రంగు మారడంతో ధాన్యాన్ని కొనడంలేదన్నారు. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొందన్నారు. ఒక పక్కన ఒడ్డునూర్చిన తర్వాత సంచుల కోసం ఆర్బికే కేంద్రాల వద్ద నానా తంతాలు పడుతుండగా, మరో పక్కన ఆకాశంలో మబ్బులుప డటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వం పెట్టినటువంటి నిబంధనలు సడలించి వెంటనే రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి. జ్యోతి బస్సు, బలరాం, బొబ్బ శ్రీనివాసరావు, డొక్కు సాంబశివరావు, గంట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రేపు పీబీ సిద్ధార్థలో బ్లిట్జ్ క్రీగ్-2023



ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో 4వ తేదీ బ్లిట్జ్ క్రీగ్-2023 పేరుతో ఒకరోజు రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల సాంకేతిక, సాంస్కృతిక పోటీలు సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. సోమవారం ఉదయం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మేకా రమేష్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అసోసియేషన్ ద్వారా 2006వ సంవత్సరం నుండి నిరంతరాయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా విద్యార్థుల నిర్వహణ, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎంతో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి జంపాల మాట్లాడుతూ 'బ్లిట్జ్ క్రీగ్' అనే జర్మన్ భాషా పదానికి మెరుపు దాడి అనే అర్థమని, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు తమ సాంకేతిక మరియు సాంస్కృతిక నైపుణ్యాలతో ఇతరులతో పోటీ పడటానికి ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త కంప్యూటర్ సైన్స్ ఇంఛార్జి కోనేరు సుధీర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సాంకేతిక పత్ర సమర్పణ, పోస్టర్ ప్రజెంటేషన్, కంప్యూటర్ క్విజ్, కోడింగ్ అండ్ డీకోడింగ్, బిజినెస్ ఐడియాస్,స్పాట్ ఫోటోగ్రఫీ, నిధి అన్వేషణ, సంగీత వాయిద్య, మిస్టర్ అండ్ మిస్ బ్లిట్జ్ క్రీగ్ వంటి ఎనిమిది అంశాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలతో కూడిన గోడపత్రికను విడుదల చేశారు.



చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూమ్ ప్రారంభం


ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్స్ ఆథరైజ్డ్ షోరూమ్‌ను సోమవారం సాయంత్రం ఎం.జి.రోడ్డులో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ యం.పురేంద్ర ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ల షోరూమ్ ప్రారంభించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. వరుణ్ బజాజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న పెట్రోల్ ధరల కారణంగా ఎక్కువ మంది నేడు ఎలక్ట్రిక్ వాహనాల పట్ల ఆసక్తి కనపరుస్తున్నారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బజాజ్ ఎలక్ట్రిక్ స్కూటర్ల రంగంలో ప్రముఖ తయారీ సంస్థ బజాజ్ ఆటో నగరంలో మొదటిసారిగా చేతక్ షోరూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. బజాజ్ జోనల్ మేనేజర్ గోపాల్ శ్రీవాస్తవ మాట్లాడుతూ తక్కువ మెయింటెనెన్స్, కాలుష్యరహితమైన చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్లు అన్ని వయసుల వారికి అనువుగా ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో చేతక్, వరుణ్ బజాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి ఫిల్టర్ బెడ్ నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: ఎనికేపాడు గ్రామంలో మంచినీటి శుద్ధి కి ఫిల్టర్ బెడ్ నిర్మించాలని సర్పంచ్ రాచమళ్ళ పూర్ణచంద్రరావు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కలిసి వినతి పత్రం అందజేశారు.



గ్రామంలో ప్రవహిస్తున్న రైవేస్ కాలువ నీటిని సుమారు మూడు ఎకరాల విస్తీర్ణం గల రామయ్య చెరువులో నింపి, పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి నీటిని శుద్ధి చేసి ప్రజలకు ఇవ్వటం ద్వారా లబ్ధిచేకురుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎంపిటీసి గంగుల శ్రీనివాస్, వార్డు సభ్యులు రాచమళ్ళ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



'సమన'కు యూనివర్సిటీ గుర్తింపు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఫ్యాషన్ డిజైనింగ్ రంగం చేయూతనిస్తుందని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. సోమవారం సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ ప్రాంగణంలో జరిగిన ఒప్పంద కార్యక్రమానికి సిఇవో షీబా అధ్యక్షత వహించారు. ఐనుల్ హసన్ మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైన్ రంగంలో అనేక మందికి ఉపాధి కల్పించి మన్ననలు పొందుతున్న సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ పనితీరు పట్ల సంతృప్తి చెంది యూనివర్సిటీ గుర్తింపును ఇవ్వడం జరిగిందన్నారు. భవిష్యత్తులో సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్‌లో విద్యను అభ్యసించేవారు తమ యూనివర్సిటీ పరీక్షలకు అర్హులని, సర్టిఫికెట్లు కూడా అందజేయటం జరుగుతుందన్నారు. సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ సిఇవో సమన మూసవి మాట్లాడుతూ అనేక సంవత్సరాల తమ కృషికి ఈ రోజు జాతీయ యూనివర్సిటీ గుర్తింపు నివ్వడం ఆనందంగా ఉందన్నారు. త్వరలో లక్నోలో మరో సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ శాఖను ప్రారంభిస్తామన్నారు. అనంతరం డిజైన్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఐనుల్ హసన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వక్ఫ్ బోర్డు మెంబరు అల్తాఫ్ హుస్సేన్, సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ ప్రిన్సిపల్ ఆయేషా పాల్గొన్నారు.

కారిడార్ పనులు పూర్తి చేయాలి: కమిషనర్



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: గన్నవరం ఎయిర్‌పోర్టు కారిడార్ పనులు సత్వరమే పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా పనులు జరగాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రామవరప్పాడు రింగు నుంచి గన్నవరం ఎయిర్ పోర్ట్ వరకు చేపట్టిన పనులను సోమవారం కమిషనర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం రామవరప్పాడు రింగు, ప్రసాదంపాడు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి టైల్స్ మధ్యన ఖాళీలు లేకుండా వేయాలని మరియు కర్బ్ వాల్ అంచులు పగిలిపోవడము గమనించి వాటి నాణ్యత ప్రమాణాలు పరిశీలించి అధికారులకు పలు ఆదేశించినారు. కారిడార్ పనులను వాటి యొక్క వివరాలను మరియు ఎటువంటి ఇబ్బందులు ఉన్నాయో అడిగితెలుసుకొని పలు సూచనలు ఇచ్చి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

అర్జీల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరపాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ముందుగా కమిషనర్ నగర ప్రజలకు, విఎంసి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పునరావతం కాకుండా వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమానికి మొత్తం తొమ్మిది అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) యం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. పి.రత్నావళి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు. నగరంలోని మూడు సర్కిల్స్ కార్యాలయాల్లో జరిగిన స్పందనకు నాలుగు అర్జీలు వచ్చాయి.



18వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి-వీరులపాడు: వీరులపాడు మండల కేంద్రం మార్పుకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్ష 18వ రోజుకు చేరింది. రైతు సంఘం నాయకులు ఒట్టికొండ పార్థసారథి, వట్టికొండ రమేష్, ఒటికొండ చంద్రమోహన్ సోమవారం దీక్షలో కూర్చున్న వారికి పూలమాల వేశారు. పలు విద్యార్థులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. గడ్డం కోటేశ్వరమ్మ, యేసే పోగుమహాలక్ష్మి, గుడేటి చిన్నమ్మాయి, అద్దంకి అచ్చమ్మ, గద్వాల కాంతమ్మ, అద్దంకి పేమయ్య, బాణావతి రాము రిలే దీక్షలో కూర్చున్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదన

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: నిడమానూరు గ్రామపంచాయతీ గ్రామసభ సోమవారం సర్పంచ్ శీలం రంగారావు అధ్యక్షతన జరిగింది. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ గ్రామపంచాయతీ వార్షిక వివరములు, గ్రామపంచాయతీలో అమలు జరుగుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగారావు మాట్లాడుతూ గ్రామంలో రాబోవు మూడు సంవత్సరాలలో చేపట్టబోవు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అంతర్గత రహదారులు, సిసి రోడ్లు అభివృద్ధికి రూ.50 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని బస్టాండ్ లైబ్రరీ పక్కన గల ధరణికోట వారి భవన్‌లో రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మాక్సివిజన్ హాస్పిటల్ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అఖిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరంలో 50 మందిని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ధరణికోట వెంకటరమణ, ప్రెసిడెంట్ దారా వినోద్‌బాబు, సెక్రెటరీ ఎస్ ఏ ఫనీ, ముత్యాలరావు, కౌన్సిలర్ ఉష, టెక్నీషియన్ శంకర్రావు, క్యాంపు ఇన్చార్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కమిషనర్ చాంబర్‌లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం జరిగాయి. కమిషనర్ కేక్ కట్ చేసి, ఎంప్లాయిస్ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగర పరిశుభ్రతకు, నగరాభివృద్ధిలో ఉద్యోగుల కృషి ఎంతో అవసరమని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ యమ్, శ్యామల, (జనరల్) అసోసియేషన్ అధ్యక్షులు దోప్పలపూడి ఈశ్వర్, సీనియర్ అసిస్టెంట్, ఎం. నిర్మలజ్యోతి, సూపరింటెండెంట్, టి.నాగేశ్వరావు, సూపరింటెండెంట్ కె.సురేంద్ర, సీనియర్ అసిస్టెంట్ జి.ప్రకాష్‌సాగర్, జూనియర్ అసిస్టెంట్, మినిస్టరియల్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల్లో నైపుణ్యం పెరిగేలా విద్యాబోధన : కలెక్టర్



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో నైపుణ్యాని పెంపొందించే విధంగా విద్యా బోధన ఉండాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. నగరంలోని పటమట కోనేరు బసవయ్య బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలోని 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో విద్యా పరమైన విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ కనపరచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. 10వ తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల చేసినందున మరింత శ్రద్ధతో చదివి పాఠ్యాంశాలపై పట్టు సాధించాలన్నారు. చేతిరాతను మరింత మెరుగుపరచుకోవాలన్నారు. ఇప్పటి నుండే బాగా చదువుకుంటే భవిష్యత్‌లో అన్ని పోటీ పరీక్షలలోను ఉత్తీర్ణత సాధించవచ్చునన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల కంటే సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. ఇంగ్లీష్ తెలుగు వంటి భాషలపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. రానున్న రెండు నెలలు కీలకమని పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక బద్ధంగా ఏకాగ్రతతో చదువుకుని మంచి గ్రేడింగ్ మార్కులు సాధించాలని కలెక్టర్ ఢిల్లీరావు విద్యార్థులను కోరారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి

- కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) అర్జీదారు సంతప్తే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రవేశ పెట్టిందని జిల్లా కలెక్టర్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత్ సింగ్ స్పందన నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. స్పందన గ్రీవెన్స్ పరిష్కార వ్యవస్థ మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు ప్రజల సమస్యలు సూక్ష్మస్థాయిలో పరిశీలించి సమర్ధవంతంగా పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశ పెడుతుందన్నారు. స్పందనలో భాగంగా ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీల పెండింగ్ కలెక్టర్ స్పందనలో సమీక్షించారు. జగనన్నకు చెబుదాం అర్జీల పెండింగ్ 282 ఉన్నాయని, పెండింగ్ పరిష్కారంపై దష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఈ-ఆఫీస్ అమలు పటిష్ట వంతంగా చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జీఓలో పేర్కొన్న విధంగా వివిధ శాఖల్లో ఫైళ్లు అన్నీ ఈ-ఆఫీస్ ద్వారానే పంపాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా అన్ని కార్యాలయాల్లో ఈ-టపాల్స్, ఈ-డిస్పాచ్ కచ్చితంగా అమలు చేయాలన్నారు. సోమవారం నుండి అన్ని కార్యాలయాల్లో ముఖ ఆధారిత హాజరు నమోదుకు ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల అమలుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సుస్థిరాభివద్ధి లక్ష్యాలు సాధనలో 8 అభివద్ధి సూచికలలో నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో గుర్తించిన పిల్లలలో తక్కువ బరువు, ఎత్తు తక్కువ నివారణకు బాలామతం, జగనన్న గోరుముద్ద వంటి పథకాల కింద పౌష్టికాహారాన్ని అందిస్తూ, అవసరమైన వైద్యం అందిస్తూ వారిలో వారం వారం ఎదుగుదల నమోదు చేస్తూ, నెలవారీ నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు ఈకేవైసీ 47 శాతం పూర్తయిందని, మిగతా పెండింగ్ త్వరగా పూర్తిచేయించాలని డిఎంఅండ్ హెచ్ కు సూచించారు.

ఆధార్ నమోదు కిట్లు పంపిణీ : జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల్లో 101 ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు



చేస్తున్నట్లు, అందుకు గాను ఒక్కొక్కటి లక్షన్నర విలువైన ల్యాప్టాప్ సంబంధిత పరికరాలతో కూడిన కిట్లు ఆయా సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్లకు కలెక్టర్ పంపిణీ చేశారు. అలాగే జిల్లా దివ్యాంగుల సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ ద్వారా ఇద్దరు దివ్యాంగులకు ల్యాప్ టాప్ లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, మూడా వీసి బి.శివనారాయణ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ ఓ డా.గీతాబాయి, పీడి ఐసిడిఎస్ సువర్ణ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ, రామ్ కుమార్ డిఇఓ తహెరా సుల్తానా, డిపిసీ వి. పార్వతి పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుడివాడ : ప్రజాశక్తి 2023 నూతన సంవత్సరం క్యాలెండర్ ను గుడివాడ మున్సిపల్ కమిషనర్ పిజె సంపత్ కుమార్ సోమవారం మున్సిపల్ కార్యాల యంలోని ఆయన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రతి అక్షరం ప్రజల పక్షం నిలుస్తుందనే మాట నిజం చేస్తూ పేదలకు అండదండలుగా నిలుస్తుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ టి వెంకట రంగారావు, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జ్ టి జి ప్రకాష్, పారిశ్రామికవేత్త మలిరెడ్డి రాధాకష్ణారెడ్డి, టి వినీత్, వి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



దీక్ష భగ్నం చేస్తున్న పోలీసులు

కాపునేత వెంకట్రావు దీక్ష భగ్నం, అరెస్ట్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : హరిరామ జోగయ్య దీక్షకు మద్దత్తు దీక్ష కొనసాగింపుగా సోమవారం మచిలీపట్నంలో కాపు సంక్షేమ సేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొట్టె వెంకట్రావ్ నిరసన దీక్ష చేపట్టారు. కాపులకు రిజర్వేషన్లు, హరిరామ జోగయ్యకు మద్దతుగా దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత రాత్రి హరిరామ జోగయ్య దీక్షను పోలీసులు భగ్నం చేసిన విషయం విధితమే. హరిరామ జోగయ్య దీక్షను తాను కొనసాగిస్తానంటూ వెంకట్రావు స్థానిక బ్రహ్మపురంలోని నివాసంలో దీక్షకు కూర్చున్నారు. దీక్షాస్థలి వద్దకు భారీగా కాపు సంక్షేమ సేన నాయకులు, కార్యకర్తలు, రాధా-రంగా మిత్ర మండలి సభ్యులు చేరుకున్నారు. అంతటితో అక్కడికి చేరుకున్న పోలీసులు కాపు రిజర్వేషన్ కోసం తన నివాసంలో నిరవధిక దీక్షకు దిగిన వెంకట్రావును దీక్ష విరమించాలని కోరారు. వాగ్వివాదానికి దిగిన వెంకట్రావును అరెస్ట్ చేసి పోలీసు స్టేషనుకు తరలించారు. కాపు సంక్షేమ సేన నాయకులు వెంకట్రావు అరెస్టును తీవ్రంగా ఖండించారు.

ఉయ్యూరు బాలోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : జీవితానికి చదువు చాలా ముఖ్యమే కానీ పిల్లలు ఒత్తిడితో కాకుండా ఇష్టపడి చదివే వాతావరణం కావాలని ఉయ్యూరు బాలోత్సవాల కమిటీ ప్రధాన కార్యదర్శి కొలుసు విశ్వ మోహన్ అన్నారు. సోమవారం స్థానిక నాగళ్ళ రాజేశ్వరమ్మ ,జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో ఉయ్యూరు బాలోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విశ్వ మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలు ఎన్ని నేర్చుకున్న వాటిని ప్రదర్శించేందుకు వేదికలు ఉండటం లేదన్నారు. మనకు ఎంతో ఇస్తున్న సమాజానికి కొంతైనా తిరిగి ఇవ్వాలన్న సామాజిక చైతన్యం పెరగాలి చిన్నారుల్లో ఇటువంటి విశాల భవనాలు పెరగడానికి సజనను ప్రోత్సహించడానికి ఉయ్యూరు బాలోత్సవం పిల్లల పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బాలోత్సవంలో అకాడమిక్, సాంస్కతిక విభాగాల్లో ఈవెంట్లు జరుగుతాయని తెలిపారు. ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, కంకిపాడు, పామర్రు మండలాలలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సమావేశానికి ఉయ్యూరు బాలోత్సవాల కమిటీ అధ్యక్షులు



కాగిత గోపాలకష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు చొప్పవరపు వెంకటేశ్వరరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు మాజేటి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సుగుణ కిషోర్ ,రిటైర్డ్ ఎంఈఓ పివి మల్లేశ్వరరావు, రిటైర్డ్ లెక్చరర్ కళ్లెం సాంబిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు పివి రమణ, ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ మైనేని మల్లిఖర్జున వరప్రసాద్, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కె వై కె రెడ్డి, కష్ణాజిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు కోసూరి శివ నాగేంద్రం, కష్ణాజిల్లా డివైఎఫ్ఐ కార్యదర్శి బాజీ బాబు తెల్లాకుల తదితరులు పాల్గొన్నారు.

సభలు, సమావేశాలకు అనుమతి లేదు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 18 వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని బందరు డిఎస్పీ షేక్ మాసుం భాష ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, నిరసన దీక్షలు, బహిరంగ ప్రదర్శనలు, ర్యాలీలు చేయడంపై నిషేధము ఉందన్నారు. సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ముందస్తు అనుమతి తీసుకోకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై చట్ట ప్రకారము చర్యలు ఉంటాయని తెలిపారు.

గుంటూరు ఘటన బాధాకరం

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : గుంటూరులో ఉయ్యూరు ఫౌండేషన్ చేపట్టిన పేదలకు కానుకల పంపిణీ కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి ముగ్గురు చనిపోయిన ఘటనపై కొనకళ్ళ నారాయణరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా వికాస్ నగర్ లో చంద్రన్న కానుక పంపిణిలో జరిగిన అపశతిలో ముగ్గురు చనిపోవడం చాలా విచారం వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అయన అన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ (ఐఆర్ సిఎస్), జిల్లాశాఖ అధ్వర్యంలో చిన్నాపురం జిల్లాపరిషత్ హైస్కూలులో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తోట బాలాజీ తెలిపారు. స్థానిక జిల్లా ఐఆర్ సిఎస్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం 4 వ తేదీ జరిగే మెడికల్ క్యాంపును కలెక్టర్ పి రంజిత్ బాషా ప్రారంభిస్తారని తెలిపారు. విజయవాడ మణిపాల్ హాస్పిటల్ వైద్యులు, ఇతర వైద్యులచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేస్తామన్నారు. సాధారణ సమస్యలతో పాటు డయాబెటిక్, గుండె, క్యాన్సర్, చెవి, ముక్కు, గొంతు, డెంటల్, కంటి పరీక్షలు నిపుణులైన డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. చిన్నాపురం పరిసర గ్రామాలలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శంకర్నాథ్ భవిరి, కోశాధికారి కొండపల్లి బాలాజీ, డా.హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు.

హరిరామజోగయ్య దీక్ష భగ్నంపై ఖండన

ప్రజాశక్తి-అవనిగడ్డ : గత ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కాపుల రిజర్వేషన్లు అమలు చేయకుండా కాపులను ఆగదొక్కడానికి చూస్తోందని మాజీ ఉపసభాపతి మండలి పెద్ద ప్రసాద్ విమర్శించారు గాంధీ క్షేత్రం వద్ద బుద్ధ ప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, కాపు సంక్షేమ సేవ రాష్ట్ర అధ్యక్షులు చే గుండి హరి రామజోగయ్య కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాలని లేకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ముందుగానే ప్రభుత్వానికి తెలియజేస్తే ఒకరోజు ముందే ఆయనను అరెస్టు చేసి దీక్షను భగ్నం చేయడానికి కుట్రజేసి వైద్యశాలకు తరలించడం ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశారు.

హరి రామ జోగయ్య అరెస్ట్ దుర్మార్గపు చర్య

కాపుల రిజర్వేషన్ల కోసం రెండవ తేదీ నుండి ఆమరణ నిరాహార దీక్ష చేయనున్నట్లు ప్రభుత్వంకు లెటర్ రాసిన ఆయనను ముందుగానే ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేయడం జనసేన పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు విమర్శించారు.

మత్తుపదార్థాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని కొత్తపేట సచివాలయంలో మత్తు పదార్థా లు వినియోగించడం, కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ జి నూకరాజు పాల్గొని గ్రామస్తులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎస్సై మహమ్మద్ అలీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని లక్ష్యసాధనలో ముందుండాలని సూచించారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ ఏ వీర కుమారి మాట్లాడుతూ దురాలవాట్లను అదుపులో ఉంచుకోకపోతే అవి అవసరాలుగా మారి అనర్థాలకు దారితీస్తాయని చెప్పారు.

గృహ ప్రవేశానికి 'అయోధ్య' సిద్ధం

- రాఖీ అవెన్యూస్ డైరెక్టర్ గుర్రం నాని



ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర చరిత్రలోనే అత్యద్భుతంగా గన్నవరంలో రూపుదిద్దుకున్న అపార్టుమెంట్ల లార్జెస్ట్ గేటెడ్ కమ్యూనిటీ 'అయోధ్య' గృహప్రవేశ సుముహూ ర్తానికి సిద్ధమవుతోందని రాఖీ అవెన్యూస్ డైరెక్టర్ గుర్రం నాని తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో కొత్త ఇంటి గహప్రవేశం మనందరి సారధ్యంలో కేవలం 12 నెలల కాల వ్యవధిలో అత్యద్భుతంగా రూపుదిద్దుకున్న 670 అపార్టుమెంట్ల లార్జెస్ట్ గేటెడ్ కమ్యూనిటీ "అయోధ్య" గృహప్రవేశ సుముహూర్తానికి సిద్ధమయ్యిందన్నారు. కేవలం రెండు మూడు నెలల స్వల్ప సమయంలోనే అపార్ట్మెంట్ల యజమానులు, వారి బంధుమిత్రులు , శ్రేయోభిలాషుల సందడి సాక్షిగా మన అయోధ్య లో



ఘనంగా గహప్రవేశం చేద్దాం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే మహాద్భుత జనావాస ఘన సౌధ నిర్మాణానికి మనమందరం ఉమ్మడి కుటుంభంగా సహాయ సహకారాలను అందిపుచ్చుకొని ఈ ఘనత స్వంతం చేసుకొన్న అయోధ్య కుటుంభ సభ్యులందరికి జేజేలు పలుకుతున్నామని తెలిపారు. ఈ ఘన కీర్తి తరతరాలుగా ఇలాగే కొనసాగాలని, కొనసాగుతుందని చెప్పారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత సమీపంలో.. అంతర్జాతీయ సౌకర్యాలతో.. అత్యాధునిక హంగులతో.. ఆంధ్రప్రదేశ్ లోనే అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీగా ఆవిర్భవించిన లగ్జరీ అపార్టుమెంట్ల సముదాయం ఇది అన్నారు. "అయోధ్య" నిర్మాణం పూర్తికావచ్చింది.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన మన ప్రియతమ నాయకులు, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు వల్లభనేని వంశీ మోహన్ సువర్ణ హస్తాల మీదుగానే ప్రారంభోత్సవం జరగనుందన్నారు. మా కస్టమర్లకు అపార్టుమెంట్లు అందించనున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నట్లు చెప్పారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కీర్తికిరీటంలో కలికితురాయిగా భాసిల్లే "అయోధ్య" దిగ్విజయ యాత్రలో భాగస్వాములైన మా కస్టమర్లు, మార్కెటింగ్ సిబ్బంది, మెటీరియల్ సప్లయర్స్, కార్మిక సోదరులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అందరికీ అభినందనలు తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు : కలెక్టర్

అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం : మహేష్

ప్రజాశక్తి-వన్‌టౌన్: కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని హరి రామ జోగయ్య చేపట్టిన దీక్షను భగ్నం చేసి ఆయన్ను అరెస్టు చేయటం బాధాకరమని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ తెలిపారు. జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం పోతిన మహేష్ మాట్లాడుతూ హరి రామ జోగయ్య అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 10 శాతం ఈబీసీ రిజర్వేషన్ అమలు చేయాలని ఆ పది శాతంలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని చేస్తున్న దీక్షకు ప్రభుత్వం కుట్రపూరితంగా అడ్డంకులు సృష్టిస్తుందన్నారు. 80 సంవత్సరాల వయసున్న జోగయ్య చేస్తున్న ఉద్యమానికి 50 సంవత్సరాల యువ ముఖ్యమంత్రి భయపడిపోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర ఉపాధ్యక్షులు వెన్నా శివశంకర్, బొబ్బూరి కొండలరావు, పులిచేరి రమేష్, బైపు. రామకృష్ణ, నోచర్ల పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

'పది'లో మెరిసేలా ...

విద్యార్థులు రాయల్సి ఉంటుంది. నూతన ప్రశ్నా పత్రంపై అవగాహన కల్పించడంతో పాటుగా విద్యార్థుల్లో పరీక్ష భయం తొలగడానికి ఈవిధానం దోహదపడుతుందని విద్యాశాఖ భావిస్తున్నారు. పరీక్ష కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించారు. నాడు నేడు కింద అభివృద్ధి చేసిన పాఠశాలల్లోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఏ పాఠశాలలో పూర్తిస్థాయి మౌలిక వసతులు ఉంటాయో వాటిని గుర్తించే పనిలో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. గత ఏడాది మాస్ కాపీయింగ్ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణలో ఇటువంటి అవకతవకలు జరగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరు సబ్జెక్టుల్లో పరీక్షలు

గతంలో 11 పరీక్షలుగా నిర్వహించేవారు. అయితే గత ఏడాది ఏడు సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, లెక్కలు, సోషల్ ఒక్కొక్క సబ్జెక్టుగా, సైన్స్ కు సంబంధించి పిఎస్, ఎన్ఎస్ రెండు సబ్జెక్టులు గా నిర్వహించారు. అయితే ఈ ఏడాది ఆరు సబ్జెక్టులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు.

యాప్ ద్వారా ఉద్యోగుల హాజరు తప్పనిసరి

ముఖ ఆధారిత ద్వారా ప్రతి రోజు హాజరును నమోదు చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేయడం జరిగిందన్నారు. ముఖ ఆధారిత హాజరు నమోదులో కొత్తగా ఎటువంటి నియమ నిబంధనలు విధించలేదన్నారు. గతంలో ఉన్న నిబంధనలను మాత్రమే నూతన విధానంలో పొందు పరచడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయంలో మాన్యువల్‌గా హాజరును తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఉద్యోగికి మూడు సార్లు గంటకు మించి ఆలస్యంగా కార్యాలయాల విధులకు హాజరతే ఒక రోజు సాధారణ సెలవుగా పరిగణించే నిబంధన అమలులో ఉందన్నారు. ముఖ ఆధారిత హాజరు ద్వారా ఉద్యోగి ఏ సమయానికి విధులకు హాజరయింది. ఏ సమయానికి కార్యాలయం విడిచి వెళ్లింది స్పష్టంగా తెలుసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ విధానం వలన జవాబు దారితనం పెరుగుతుందని ప్రజలలో ప్రభుత్వం ఉద్యోగులు ఆలస్యంగా హాజరవుతారనే అపోహలను తొలగించి వారికి పారదర్శకతతో కూడిన సేవలు అందిస్తున్నట్లు సందేశం ఇవ్వగలుగుతామని, ప్రజలలో ఉద్యోగులపై అపరమైన గౌరవం పెరుగుతుందని అన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ముఖ ఆధారిత హాజరును నమోదు చేసుకున్నారు.

వారంలో పోర్టు భూసేకరణ పూర్తి

3.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు. పోతేపల్లి, చిలకలపూడి మంగినపూడి, కర్రగ్రహారం మీదుగా కొనసాగి రోడ్డు గత ప్రభుత్వంలో నిర్మించిన ఫైలాన్ సమీపంలోని ఐస్ ఫ్యాక్టరీ మధ్యలో నుండి ఈ రహదారి కొనసాగుతుందన్నారు. జనవరి 10వ తేదీలోపు నిర్దేశించిన మ్యాపును స్పష్టంగా వివిధ రంగుల్లో చిత్రీకరించి తనకు అందజేయాలని ల్యాండ్ అండ్ రికార్డ్స్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ డాక్టర్ అపరాజిత సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, ముడా వైస్ చైర్మన్ బి.శివ నారాయణరెడ్డి, మ్యారి టైం బోర్డు డైరెక్టర్ విద్యాశంకర్, మచిలీపట్నం తహసీల్దార్ సునీల్‌బాబు, జిల్లా ల్యాండ్ రికార్డ్స్ సూపరింటెండెంట్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విజయవాడ: కోడి పందాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని ఉల్లంగించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు హెచ్చరించారు. జిల్లాలో కోడి పందాలు నివారించేందుకు ముందస్తు చర్యలలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా జంతు సంక్షేమ సంఘం చైర్మన్ ఎస్. ఢిల్లీరావు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని పింగళివెంకయ్య సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974 సెక్షన్ 34- జంతుహింస నివారణ చట్టం 1960 ల ప్రకారం కోడి పందాలను నిషేదించడం జరిగిందన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించికుని జిల్లాలోని పలు ప్రాంతాలలో నిర్వహకులు కోడి పందాలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెటుకుని కోడి పందాలను నివారించేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జంతు సంరక్షణ చట్టం ప్రకారం పందేలు నిర్వహించిన వీక్షించేందుకు పాల్గొన్న నేరమేనన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రచారం నిర్వహించి కోడి పందాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కోడి పందేలు నిర్వహించుట- పాల్గొనుట చట్టరీత్యా నేరంపై ముద్రించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఢిల్లీరావు విడుదల చేశారు.



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

స్పందనలో 67 అర్జీలు నమోదు

స్పందన అర్జీలు స్థానికంగానే పరిష్కారం అవుతాయనే సమాచారాన్ని అర్జీదారులకు తెలపాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా స్థానిక పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఢిల్లీరావు అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రతీ సోమవారం స్పందన కార్యక్రమం జిల్లా స్థాయిలోనే కాకుండా డివిజన్, మండల, గ్రామ వార్డు సచివాలయాలలోను నిర్వహించడం జరుగుతుందని అర్జీదారులు తమ వినతులను స్థానికంగానే సమర్పించవచ్చుననే సమాచారాన్ని ప్రజలకు తెలపాలన్నారు. స్వీకరించిన వినతులకు స్థానికంగానే పరిష్కరింప చేయడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అర్జీలు తిరిగి నమోదు కాకుండా ప్రాథమిక దశలోనే పరిష్కారం చూపినట్లయితే జిల్లా కేంద్రానికి అర్జీదారులు మరోక సారి రాకుండా ఉంటుందన్నారు. రీ ఒపెన్ అవుతున్న అర్జీలకు సంబంధించి ప్రతీ శనివారం సంబంధిత అధికారులు అర్జీదారులతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తూ అన్ని స్థాయిల్లోను అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కారం చూపుతున్నామని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. స్పందనలో 67 వినతులు నమోదు కాగా వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖలో 25 అర్జీలు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, ఐసిడిఎస్ పీడీ జి. ఉమాదేవి, డిఎస్‌వో పి. కోమలిపద్మ, డిసివో సిహెచ్ శైలజ, డిఆర్‌డిఏ పీడీ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ శ్రీదేవి, మార్కెటింగ్ డిడి దివాకర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి యం విజయభారతి, డియంహెచ్‌వో డా.యం సుహాసిని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం : కలెక్టర్

విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన చెక్కా రాజేష్ కుటుంబాన్ని అని విధాల ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ వెహికల్ డిపోలో బాబ్‌కాట్ (పొక్లెయిన్) ఒప్పంద డ్రైవర్‌గా పని చేస్తూ ప్రమాదంలో మృతి చెందిన చెక్కా రాజేష్ కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పరామర్శించి అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా నగరపాలక సంస్థ ద్వారా రూ.10 లక్షలు, పక్కా గృహం, తన వంతు సహకారంగా వ్యక్తిగతంగా రూ.10 వేలు అందజేస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.



రద్దు చేసిన పెన్షన్లను పునరుద్ధరించాలి

కమిషనర్‌కు సిపిఎం, టిడిపి ఫ్లోర్‌లీడర్ల వినతి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరంలో రద్దు చేసిన వేలాది పెన్షన్లను పునరుద్ధరించాలని కోరుతూ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సిపిఎం, టిడిపి ఫ్లోర్‌లీడర్లు బోయి సత్యబాబు, నెల్లిబండ్ల బాలస్వామి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలో రద్దు చేసిన 4,500 పెన్షన్లు పునరుద్ధరించాలని కోరారు. విద్యుత్ బిల్లు, ఇంటి స్థలం, ఐటీ రిటర్న్స్, ఒక రేషన్ కార్డులో ఇద్దరికీ పెన్షన్ వస్తుందని తప్పుడు సాకులతో పెన్షన్లు రద్దు చేయడం అన్యాయం అని అన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రాజకీయ నాయకుల, కార్యకర్తల ప్రమేయం లేకుండా సచివాలయం సిబ్బంది వాలంటీర్ ద్వారా ఇంటింటికి పంపిణీ చేసి రాజకీయ జోక్యాన్ని నివారించాలని కోరారు. ప్రతిపక్ష సభ్యుల ప్రజాస్వామ్య హక్కులను, ప్రోటోకాల్‌ని అమలు చేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రద్దు చేసిన పెన్షన్లు పునరుద్ధరించే వరకు ఆందోళన, పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ విషయాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డిఎస్ఎంసి పాఠశాల తరలింపు

ప్రజాశక్తి-వన్‌టౌన్: విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో గల దళవాయి సుబ్బరామయ్య నగర పాలక సంస్థ (డిఎస్ఎంసి) ఉన్నత పాఠశాల నూతన భవనం నిర్మాణం నేపథ్యంలో సంబంధిత పాఠశాలను అదే ప్రాంతంలో గల శ్రీ మైలపల్లి పోలీస్ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. సిబ్బంది, విద్యార్థులు సోమవారం ఖాళీ చేసి తుళ్ళూరు వారి వీధిలోని శ్రీ మైలపల్లి పోలీస్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవనంలోకి తరలించారు. ఈ నేపథ్యంలో నూతన వసతిలోకి స్థానిక కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతం నూతన ప్రాంగణంలో మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. డిఎస్ఎంసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నూతన భవన నిర్మాణం సంతోషకరమన్నారు.



కార్పెంటర్స్ నూతన కమిటీ

కార్పెంటర్స్ నూతన కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-కోడూరు : కోడూరులోని బైపాస్ రోడ్డులో కార్పెంటర్ యూనియన్ జాయింట్ సెక్రెటరీ పోతకమూరి నవీన్ షాపు వద్ద సోమవారం కార్పెంటర్ యూనియన్ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మేక వీర రాఘవయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కార్పెంటర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, కార్పెంటర్స్ భీమా సదుపాయం గురించి చర్చించారు. అనంతరం నూతన కమిటీ ఎంపిక జరిగింది. కొత్త కమిటీ అధ్యక్షులు దేవరపల్లి ఏడుకొండలు, ఉపాధ్యక్షులు రామాను శ్రీనివాసరావు, సెక్రటరీ వంగివరపు జోషి, జాయింట్ సెక్రటరీ సైకం నాగకష్ణంరాజు, కోశాధికారి పోతకమురి నవీన్ మెంబర్లుగా షేక్ షాబు, చిర్రావూరి అనిల్, లంకె రవికుమార్, సైకం శివ నాగరాజు, కొక్కిలిగడ్డ మోహన్, కొప్పనాతి వీర వెంకట్రావు, కొప్పనాతి బాలయ్య వీరందరూ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్స్ యూనియన్ మాజీ సెక్రటరీ విశ్వనాథపల్లి శేషయ్య, పెద్ద సంఖ్యలో కార్పెంటర్స్ పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం : లైంగిక సంబంధాలు, కలుషిత మైన రక్తమార్పిడి, కలుషితమైన సూదులు, సిరంజిల ద్వారా హెచ్ఐవి అనేది వ్యాప్తి చెందుతుందని బుద్దవరం సర్పంచ్ బడుగు బాలమ్మ అన్నారు. సోమవారం గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ వారి సహకారంతో చైల్డ్ ఫన్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో అడ్వకసీ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ నవ్య మాట్లాడుతూ హెచ్ఐవి అనేది అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధిని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి బి. సత్యబాబుచ ఏఎన్ఎం రజిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సప్దార్ హష్మికి ఘన నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : సప్దార్ హష్మి కవి, రచయిత, కళాకారుడు అని ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్షులు కే కొండలరావు అన్నారు. సప్దార్ 33వ వర్ధంతి సభ చల్లపల్లిలో తలారి నాగేశ్వరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కొండలరావు మాట్లాడుతూ సప్దార్ హష్మి కార్మికుల కోసం తపిస్తూ వారి బాధల్ని, పరిష్కారాన్ని వీధి నాటికల ప్రదర్శించారన్నారు. ఆయన ప్రజాస్వాయం చూసి ఓర్వలేక కాంగ్రెస్ గుండాలు చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి కళాకారులు కార్యకర్తలు ఆయన ఆశయాన్ని కొనసాగించాలన్నారు. ఆయన స్ఫూర్తితో కార్మికుల కష్టాలను వీధి నాటకాల ద్వారా ప్రదర్శించి ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. తొలుత హష్మీ చిత్రపటానికి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండి కళాకారులు వాకా రామచంద్ర రావు, పోలాబత్తిన మోప ారావు, గుర్రం బిక్షం, ఆదిలక్ష్మి, యద్దనపూడి మధు, పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.



సప్దార్ హష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పెదపారుపూడి

పెదపారుపూడి మండల పరిధిలోని పెదపారుపూడి గ్రామంలోని అంగనవాడి-3 (ఎస్సీ), వెంట్రుప్రగడ గ్రామంలోని అంగనవాడి-2 (జనరల్) వేంట్ర ప్రగడ గ్రామంలోని అంగనవాడి కేంద్రం-3 (బిసి-డి) ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పామర్రు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి భాను శ్రీ తెలిపారు. ఈనెల 11న సాయంత్రం 5గంటల్లోపు పామర్రు కార్యాల యంలో దరఖాస్తులు వ్యక్తిగతంగా అందజే యాలన్నారు. అభ్యర్థులు కచ్చితంగా 10వ తరగతి పాస్ అయి ఉండాలని, 1-7-2023 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలని, వివాహితులై ఉండాలన్నారు. ఎస్సీ,ఎస్టీ, బిసి అభ్యర్థులు లేటెస్ట్‌గా కుల దవీకరణ పత్రం జతపరచాలన్నారు. అలాగే రెండు కలర్ పాస్ పోర్ట్ సైజు ఫోటోలు (రీసెంట్ ఉన్నవి మాత్రమే) కూడా జత చేయాలన్నారు. అభ్యర్థులు స్థానికులై ఉండి ఖాళీగా ఉన్నచోట్ల మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.



భోజనం పంపిణీ చేస్తున్న దృశ్యం

డొక్కా సీతమ్మ సేవా రథం ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ : పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఆకలితో ఉన్న నిరుపేదలకు ఆకలి తీర్చడానికి, అనాధ మతదేహాలు తీసుకెళ్లేందుకు ఆంధ్రుల అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ పేరుతో సేవా రథం ఏర్పాటు చేయడం అభినందనీయమని జనసేన నాయకులు షేక్ కరీం, మీరాషరీఫ్ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఆర్‌కె అధ్వర్యంలో సేవా రథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌కె మాట్లాడుతూ పట్టణంలో శుభకార్యాలలో వివిధ ఫంక్షన్‌లో ఆహారం మిగిలిపోయినప్పుడు తమకు సమాచారం ఇస్తే పదార్థాలను ఆకలితో ఉన్న పేదలకు వాటిని ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, సురేష్, చరణ్, నాగసాయి, జనసేన నాయకులు, పాల్గొన్నారు.

రికార్డుల ట్యాంపరింగ్‌లో చర్యలు తీసుకోవాలని ఆదేశం

ప్రజాశక్తి-ఉయ్యూరు : అవనిగడ్డ గ్రామపంచాయతీలో జనన నమోదు రిజిష్టరులో జననతేదీలను దిద్ది ధవీకరణపత్రాలను జారీ చేసిన కేసులో వెంటనే విచారణ పూర్తి చేసి నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కోన శశిధర్‌ను రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ ఐలాపురం రాజా ఆదేశించారు. సమాచార హక్కు చట్టం కింద అవనిగడ్డ గ్రామపంచాయతీ రికార్డుల ట్యాంపరింగ్ విషయమై ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ సమాచార కమిషన్లో 2016లో నమోదైన ఫిర్యాదుపై గత నెల 6వ తేదీన విచారణ జరిపిన కమిషనర్ ఐలాపురం రాజా గత 17 సంవత్సరాలుగా సుదీర్ఘ విచారణ చేయటంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఈ రికార్డుల ట్యాంపరింగ్లో ఆరోపణలు ఉన్న శానటరీ ఇనస్పెక్టర్ కె.సుధాకర్‌పై, పూర్వపు కార్యదర్శి వి.రంగారావుపై విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు.

వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్య అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ అప్ ద్వారా అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో నిరుద్యోగ యువతీ యువకులకు వత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ అధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రొడక్షన్ వర్క్ కోర్స్ ప్రారంభమైందని ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ తెలిపారు. ఇతర వివరాలకు 63 00 61 8985, 799 55 34 572 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి పాల్గొన్నారు

యాత్రికులతో కిటకిటలాడిన ఆలయాలు

ప్రజాశక్తి-గన్నవరం : వైకుంఠ ఏకాదశి సందర్భంగా గన్నవరంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయాలు గోవింద నామ స్మరణలతో మారుమోగాయి. వేణుగోపాల స్వామి ఆలయంలో తెల్లవారుజాము 5 గంటల నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు ,అభిషేకాలు ఆచరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించు కుంటున్నారు. మహిళలు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రం పారాయణం చేస్తున్నారు. మండవ వెంకట ప్రభాకర్ రావు ఎడ్ల బండిపై స్వామివారిని మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. తాహసీల్దార్ కార్యాలయంలోనూ, పోలీస్ స్టేషన్ లోనూ స్వామివారి ఎడ్లబండి మేళగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. మండలం వెంకట ప్రభాకర రావు ప్రత్యేక లడ్డూలను తయారు చేయించి అందరికీ పంపిణీ చేశారు.

శ్రీకాకుళంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి

ప్రజాశక్తి-ఘంటసాల : వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘంటసాల మండలంలో ఆంధ్రుల తొలి రాజధానిగా భాసిల్లిన గ్రామం శ్రీకాకుళంలో సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆంధ్ర మహావిష్ణు దేవాలయంగా చారిత్రక, పౌరాణిక విశిష్టతలు కలిగిన శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఘనంగా జరిగింది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన శ్రీకాకుళేశ్వర స్వామి, రాజ్యలక్ష్మి అమ్మ వార్లను ఉత్తర ద్వారం మీదుగా దర్శనం చేసుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఆకాంక్షతో సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు శ్రీకాకుళం చేరుకున్నారు. కష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల నుంచి వేలాదిగా శ్రీకాకుళం తరలివచ్చి శ్రీకాకుళేశ్వర స్వామి-రాజ్యలక్ష్మి వార్ల ఉత్తరద్వార దర్శనాన్ని కనులారా వీక్షించారు. ముక్కోటి సందర్భంగా స్వామి అమ్మ వార్లకు సహస్రనామార్చన, ఆస్థాన పూజ, ఉత్తరద్వారా దర్శనం, గరుడవాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం, ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్.సూర్య చక్రధర రావు, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అనువంశిక ధర్మకర్తలు చల్లపల్లి పూర్వపు జమిం దారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆర్టీసీ వారు విజయవాడ, అవనిగడ్డ, చల్లపల్లి నుంచి శ్రీకాకుళానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా భక్తులు భారీగా తరలి వచ్చారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించుకోగా, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చక్రధరరావు పట్టు వస్త్రాలతో సత్కరించారు. ప్రజాశక్తి-గుడివాడ : ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మాజీ దేవస్థానం ఛైర్మన్ నెరుసు చింతయ, అరుణకుమారి దంపతుల అధ్వర్యంలో సోమవారం భక్తులకు ఉచిత వేడి మిరియాల పాలు అందజేశారు. నెరుసు ఎన్.టి.ఆర్, నెరుసు జయరామ్, పి.రామంజనేయులు, పి.వెంకటేశ్వరరావు, కె.కిషోర్ పాల్గొన్నారు.ప్రజాశక్తి నాగాయలంక : మండల కేంద్రమైన నాగాయలంకలో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత శ్రీ నగరేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ అభివద్ధి కమిటీ ఛైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు అర్చకత్వంలో స్వామివారికి పంచామత అభిషేకాలు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారులను , స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రజాశక్తి కోడూరు : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో అభినవ మేలుకోటగా పేరుగాంచిన శ్రీ గోదా రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామి వారిని మండలి బుద్ధ ప్రసాద్, ఆయన సతీమణి విజయలక్ష్మి, మండలి వెంకట్రామ్ వారి ధర్మపత్ని సాయి సుప్రియ దర్శించేందుకు సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మండలి కుటుంబ సభ్యులకు స్వాగతం పలికారు. ఉత్తర ద్వారా శ్రీమన్నారాయణ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాశక్తి-బంటుమిల్లి : వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా పెడన నియోజవర్గ టిడిపి ఇన్చార్జ్ కాగిత కష్ణ ప్రసాద్ దంపతులు బంటుమిల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. తెలుగుదేశం పార్టీ కార్య నిర్వహణ కార్యదర్శి శ్రీ కాగిత కష్ణప్రసాద్, ఆలయ కమిటీ వారు కష్ణ ప్రసాద్ సత్కరించారు.



ఘంటసాలలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దశ్యం



లయన్స్‌క్లబ్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలోగుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ కు జిల్లా బెస్ట్ క్లబ్ అవార్డు పొందినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. డిస్ట్రిక్ 316డి ద్వారా ఆరు నెలలు ఉత్తమ సేవలు అందించడం, మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించడం వల్ల ఈ అవార్డును సాధించడం జరిగిందని తెలిపారు. విజయవాడ వెన్యూ కన్వెన్షన్లో ఆదివారం జిల్లా గవర్నర్ లైన్ శ్రీ శాంతి చేతుల మీదుగా ఈ అవార్డు అందించారు. లైన్స్ వైసిపి ప్రసాద్, జిఎస్ బోస్, శ్రీరామ్మూర్తి, ఫణి గోపాల్, విశ్వం, చిట్టి బాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ అవార్డు సాధించడం పట్ల మండల ప్రజలు లయన్స్ క్లబ్ అధ్యక్షులకు, ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

స్కూల్ బస్ క్లీనర్ మృతి

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు మండలంలో సోమవారం విషాదం చోటు చేసుకుంది. రోడ్డుపై వరి పనులను దాటించే సమయంలో బస్సు క్లీనర్ దుర్మరణం చెందాడు. గురిజేపల్లి గ్రామ సమీపంలో రోడ్డు మలుపులో వరి పనల మేట ను తప్పించే ప్రయత్నంలో శ్రీ చైతన్య స్కూల్ బస్సు టైర్లలో గడ్డి ఇరుక్కుంది. ఈ గడ్డిని తప్పించేందుకు క్లీనర్ మణికంఠ ప్రయత్నించగా బస్సును డ్రైవర్ ముందుకు నడిపాడు. దీంతో క్లీనర్ టైర్ల కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. గూడూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కిడ్నీ బాధితుడికి రూ.10 వేల పెన్షన్ అందజేత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం 51వ డివిజన్‌లోని 165వ సచివాలయం పోతిన అదెయ్య వారి వీధిలో నివాసముంటున్న విజ్జి శ్రీనివాసరావు కిడ్నీ సమస్యతో బాధపడుతూ, డయాలసిస్ చేయించు కుంటున్నాడు. అతని పరిస్థితిని తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అతనికి పెన్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, డయాలసిస్ చేయించుకుంటున్న పేషెంట్ విజ్జి శ్రీనివాసరావుకు సోమవారం కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ స్వయంగా వెళ్లి రూ. 10 వేలు పింఛన్ అందించి, ఆయన ఆరోగ్య పరిసిత్తిని అడిగి తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య, ఆరోగ్యనికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, అలాగే మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు చొరవతో అర్హులైన ప్రజలకి పథకాలు అందేలా సమన్వయ పరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీలు శ్రీనివాసరావు, వీరప్రసాద్, వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.



ట్యాబ్‌ల పంపిణీ చేస్తున్న సర్పంచ్

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : కొటికలపూడి గ్రామంలోని పాఠశాలలో బైజూస్ కంటెంట్‌కలిగిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి కొటికలపూడి సర్పంచ్ రెంటపల్లి నాగరాజు అధ్యక్షత వహించగా యమ్‌పిటిసి బండి నాగమణి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఇందులో 8వ తరగతి చదువుచున్న 23 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి మన రాష్ట్ర విద్యా వ్యవస్థని అంతర్జాతీయ స్థాయిలో ఉంచాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందరికీ జగనన్న విద్యా కానుకలను అందజేస్తున్నారన్నారు. సాంకేతిక విద్యలో రాణించాలనే ఉద్దేశ్యంతో ప్రతి విద్యార్థికి ట్యాబ్‌లను అందజేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై లీలా కుమారి ఎస్‌ఎమ్‌సి చైర్మన్ పిల్లా కారెంపూడి ఉ పాధ్యాయ సంఘాల నాయకులు సయ్యద్ ఖాసీం ఆర్మ్‌స్ట్రాంగ్ సిఆర్‌పి డి నాగేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాపునాడు అధ్యక్షులుగా సత్యనారాయణ

ప్రజాశక్తి-నందిగామ : నందిగామనియోజకవర్గ కాపునాడు అధ్యక్షులుగా సూర సత్యనారాయణ నియమితులయ్యారు. కాపునాడు జాతీయ అధ్యక్షులు గాళ్ళ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా నందిగామ నియోజకవర్గ కాపునాడు అధ్యక్షులు గా అడవిరావులపాడు గ్రామానికి చెందిన సూరా సత్యనారాయణ నియామక ఉత్తర్వులు అందుకున్నారు . కాపునాడు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న సూర సత్యనారాయణ ఎంపిక పట్ల నందిగామ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నందిగామ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు సూర సత్యనారాయణ ను ఘనంగా సన్మానించారు.

అలరించిన 'ప్రజాపాట...కూచిపూడి ఆట'

• జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నవ వసంతానికి స్వాగత కార్యక్రమం

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజాపాట...కూచిపూడి ఆట విశేషంగా అలరించింది. బందర్ రోడ్డులోని ఎంబివికె భవన్‌లో నవ వసంతానికి స్వాగతం పేరిట కార్యక్రమం ఆదివారం జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. కూచిపూడి నృత్యనీరాజనం ప్రేక్షకులను కనువిందు చేసింది. దేశ భక్తి గేయాలకు చూడచక్కని కూచిపూడి నృత్య ప్రదర్శన ముచ్చట గొలిపాయి. "జయ జయ కవి చక్రవర్తి... మా జాషువా" అంటూ నగరానికి చెందిన నాట్యాచార్య సప్పా శివకుమార్ బృందం ,'ఇదే ఇదే నాదేశం ఇదే ఆంధ్ర దేశం' అంటూ మలిశెట్టి అనూషా నాయుడు బృందం, "పాడరా ఓ తెలుగువాడా... పాడరా ఓ కలిమి రేడా' అంటూ నాట్యాచార్య పిళ్లా ఉమా మహేశ్వరరావు పాత్రుడు బృందం, రుద్రమ, బాలచంద్రుడు, తిక్కన, కందుకూరి, గిడుగు, పిడుగు వంటి మహనీయుల వేషధారణలతో సాగించిన రూపక నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తెలుగు భాషా వైభవం, సంఘ సంస్కరణ వంటి అంశాలపై భావ సౌందర్యాన్ని కనిపింప చేసే చక్కని సాహిత్యానికి అనుగుణమైన హావభావాలతో లయబద్ధంగా విద్యార్థులు కూచిపూడి నాట్యంతో నర్తించి అలరించాయి. సట్టు వేణుగోపాల్ శిష్యబృందం 'తేనెల తేటల మాటలతో మన దేశ మాతనే కొలిచెదమా' ...ఎందరు వీరు త్యాగఫలం మన స్వేచ్ఛకు మూలధనం అంటూ ఝాన్సీరాణి, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్ వంట స్వాతంత్ర్య వీరుల వేషధారణలతో భరతమాతకు భక్తితో సమర్పించిన త్యాగఫలాన్ని చక్కని నాట్యంతో ప్రదర్శించి మెప్పించారు. గోనుకుంట శైలశ్రీ శిష్య బృందం- చదవాలిరా ఎన్ని ఆటంకాలు వచ్చినా '...' జీవన





మాధుర్యం మన జీవిత సాఫల్యం ' అంశానికి మావులూరి త్రినాధచారి శిష్య బృందం , యల్లా జ్యోష్యుల ఆనురాధ శిష్యబృందం - దేశమును ప్రేమించుమన్నా మంచియన్నది పెంచుమన్నా" ఇలాంటి దేశ భక్తి గేయాలకు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంసి దాస్, గుండు నారాయణరావు, బిఆర్ తులసీరావు, జాషువా సాంస్కృతిక కమిటి సభ్యులు పాల్గొన్నారు.





విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను అంజి పుచ్చుకొని విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని జడ్పిటిసి సభ్యురాలు ఓట్ల నాగమణి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారిక సౌజన్యతో వచ్చిన పదవ తరగతి విద్యార్థులకు సోమవారం పెనుగంచిప్రోలు, అన్నిగండ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టడీ మెటీరియల్ అందజేశారు. అలాగే 8వ తరగతి విద్యార్థులకు బైజుస్ కంపెనీ తో కూడిన ట్యాబులను అందజేశారు. ఉపాధ్యాయులు కూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణశాతం పెంచేందుకు కషి చేయాలని విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి వారి బంగారు భవిష్యత్తుకు చక్కని బాటలు వేయాలని కోరారు. అనంతరం



అనగళ్లపాడు సర్పంచ్ బ్రహ్మం జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన జల మిషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే జలజ, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ సద్గురు సత్సంగం వారి ఆధ్వర్యంలో నూతన సంవత్సర కాలమాన క్యాలెండర్‌ను చిట్టినగర్‌లోని శ్రీ సద్గురు సత్సంగం కన్వీనర్ అవ్వారు శ్రీనివాసరావు (బుల్లబ్బాయి) నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సద్గురు సత్సంగం వ్యవస్థాపకులు భాగవతార్ మరడాన సాంబశివరావు, కన్వీనర్ అవ్వారు బుల్లబ్బాయి, సయ్యద్ అప్పలస్వామి కళాశాల మాజీ ప్రిన్సిపల్ వుడతా వెంకట సుబ్బారావు, ఆచారి, ఎం జేజి బాబు, సూర్య ప్రకాష్, శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవ్వారు బుల్లబ్బాయి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని భగవంతుని ప్రార్థించామని చెప్పారు. నూతన సంవత్సరం ప్రజలకు శాంతి సౌభాగ్యాలను సమకూర్చాలని ఆయన ఆకాంక్షించారు.

వైకుంఠ ఏకాదశితో పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - వన్‌టౌన్

వైకుంఠ ఏకాదశి సందర్భంగా చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ గరుడా చల స్థిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ముఖ్యంగా మహిళలు వేల సంఖ్యలో స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి వచ్చి దర్శించుకుని తరించారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ఏడిసిపి క్రైమ్స్ వెంకటరత్నం శ్రీ స్వామివారిని దర్శించుకోగా ఆమెకు దేవస్థానం అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు తదితరులు స్వాగతం పలికి స్వామివారి సమక్షంలో ఆమెను సత్కరించారు. అలాగే జనసేన విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనను దేవస్థానం పాలక మండలి వారు ఘనంగా సత్కరించారు . అలాగే కొత్తపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సుబ్రహ్మణ్యం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పాలకమండలి అధ్యక్ష కార్యదర్శులు అప్పారావు, హనుమంతరావు కోశాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పండుగను పురస్కరిం చుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉట్టి విష్ణువర్ధన్‌రావు అనే భక్తుడు శ్రీ స్వామివారికి వజ్ర కవచాన్ని బహుకరించడంతో స్వామివారిని ఈ రోజు వజ్రకవచంతో అలంకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలక కమిటీ సభ్యులు పోతిన వెంకట ధర్మారావు, మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు, ఈది ఎల్లారావు, తమ్మిన సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ దాసాంజనేయ స్వామీ వారి మందిరంలో ప్రత్యేక పూజలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా భవానీపురం ఆర్టీసి వర్క్ షాప్ రోడ్ నందు గల శ్రీ దాసాంజనేయ స్వామి వారి మందిరంలో స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయ ప్రాంగణంలో సోమవారం ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ పూజారి మునుకుట్ల శారద


ఎడిసిపి వెంకటరత్నంను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ప్రసాద్ శర్మ ఉదయం 4.గంటల నుండి భక్తులచే స్వామి వారికి పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక ప్రజలు మధ్యాహ్నం 2 గంటల వరకు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు, ఉడుముల తిరుపతి రెడ్డి, వినుకొండ మాలకొండయ్య దగ్గర ఉండి భక్తులకు ప్రసాదాలు అందజేశారు.